క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో గూండ్ల వీధి నుంచి ఏరుకల వీధి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శారద ప్రారంభించారు. ఉపాధి నిధులు రూ.20 లక్షలతో చేపట్టే పనులను నాణ్యతతో చేపడుతామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు, వీడీసీ ఆజోబ పటేల్, అసిబోద్దిన్ పటేల్, రమేశ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్ ఉన్నారు.

'వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే కక్ష'

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నార ని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు రాహుల్‌పై అనర్హత వేటును నిరసిస్తూ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రావు పటేల్, అంజాద్ షేక్, తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: తమ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ దళిత సంఘం(మాదిగ సంఘ భవనం) సభ్యులు మంత్రి ఐకేరెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రిని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సీఎస్ఆర్ నిధులు నుంచి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గంగామణి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సయ్య, వార్డు సభ్యుడు గంగాధర్, అంకం శ్రీనివాస్, కిరణ్‌రావు, లస్మన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీపీఐ సమావేశానికి తరలిన నాయకులు



పాండ్వపూర్ వద్ద నాయకులు

కడెం: మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతిపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రమేశ్, మండల కన్వీనర్ కోటయ్య, ముత్యం, భూదయ్య తదితరులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



ఆవిష్కరణలో ఎమ్మెల్యే రేఖానాయక్, సభ్యులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని రామాలయంలో ఈనెల 30న జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే రేఖానాయక్ ఆవిష్కరించారు. పట్టణంలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. చిన్నయ్య, రాజిరెడ్డి, గజేందర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ తల్లిని ఇటీవల పాముకాటు వేసింది. తండాకే చెందిన విక్రమ్‌కు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఆదివారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు.

నేడు బీఆర్ఎస్ సమ్మేళనం

మామడ: మామడ మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం మొండిగుట్ట గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమ్మేళనానికి కార్యకర్తలు రావాలని కోరారు.

నేడు ప్రజావేదిక

ఖానాపూర్: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పథకంపై ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో మల్లేశ్ తెలిపారు. స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి పనులపై వారం రోజులుగా మండలంలో సామాజిక తనిఖీలు చేపట్టారన్నారు. మూడు రోజులు దీనిపై గ్రామసభలు జరిగాయన్నారు. సోమవారం జిల్లా జిల్లా అధికారుల సమక్షంలో మండల కేంద్రంలో జరిగే ప్రజావేదికకు మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.

కంపు కొడుతున్న కాలనీ

- పిచ్చిమొక్కలు, చెత్తకు నిలయంగా ఖాళీస్థలాలు
- ప్రియదర్శినినగర్‌లో కానరాని సీసీరోడ్లు, డ్రెయినేజీలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంకరతేలి అధ్వానంగా రోడ్డు



ఖాళీస్థలంలో పెరిగిన మొక్కలు, నిలిచిన మురుగునీరు

నిర్మల్‌టౌన్: మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో పరిశుభ్రత కరువైంది. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతోపాటు చెత్తాచెదారం పేరుకుపోయాయి. దీంతో పందుల సంచారం పెరిగి దోమలు వ్యాప్తి చెందుతుండటంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

ప్రియదర్శినినగర్‌కాలనీలో..

మున్సిపాలిటీలో 34వవార్డులోని ప్రియదర్శినినగర్, ఎన్టీఆర్‌మార్గ్ కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఖాళీస్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో చెత్తాచెదారం పడేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

చెత్తతో నిండిన కందకాలు..

కాలనీలోని కందకాలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్గంధం వస్తోంది. దీంతో చుట్టుపక్కల ఇళ్ల వారు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ ప్రధాన మార్గంలో మాత్రమే సీసీరోడ్లు వేశారు. అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడంతోపాటు కంకర తేలి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో వాహనాలు సైతం కొంతకాలానికే మెకానిక్ షెడ్ల వద్దకు వెళ్తుండటంతో ప్రజలకు ఖర్చు తప్పడం లేదు. కాలనీవాసులు సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. కాని.. ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పనులు చేపట్టడం లేదు.

సమస్యలు పరిష్కరించండి



ప్రియదర్శినినగర్, ఎన్టీఆర్‌మార్గ్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి. కాలనీలోని కందకాలు అపరిశుభ్రంగా మారడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో పందులు సంచరిస్తున్నాయి. రోడ్లు సరిగా లేక ప్రజల ఆరోగ్యంతోపాటు, వాహనాలు దెబ్బతింటున్నాయి.

– తోట రాఘవేందర్, ప్రియదర్శినినగర్

మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

ఇప్పటివరకు కాలనీలో కొన్ని సమస్యలను పరిష్కరించాం. మిగతా వాటిని మున్సిపల్ దృష్టికి తీసుకెళ్తాం. ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి కందకాన్ని శుభ్రం చేయిస్తాం. సీసీ రోడ్లు వేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

–ఎర్రవోతు నవనీత సురేందర్, 34 వార్డు కౌన్సిలర్(ప్రియదర్శినినగర్)



పందుల సంచారం



ప్రియదర్శినినగర్‌లో పేరుకుపోయిన చెత్త

అటెన్షన్ ప్లీజ్.. పారిశుధ్యంపై పట్టింపేది?



ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో పలు చోట్ల డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల పక్కనే మురుగునీరు నిలుస్తోంది. చెత్తాచెదారం పేరుకుపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 94400 40793

యువజన సంఘం కార్యవర్గం

లక్ష్మణచాంద: సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా భోజన్న, ఉపాధ్యక్షుడిగా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా చిన్న సాయన్న, సెక్రెటరీగా సాయికుమార్, సలహాదారులుగా గంగాధర్, రాజేశ్వర్, రాజలింగం, రవి ఎన్నికయ్యారు.

పట్టణ కార్యవర్గం

నిర్మల్‌టౌన్: తెలంగాణ భావసార్ క్షత్రియ యువజన సంఘం నిర్మల్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు బాల చందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడిగా అంబేకర్ వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డి.హర్షిత్, కోశాధికారిగా టి.శివ, సెక్రెటరీగా యోగేశ్, జాయింట్ సెక్రెటరీగా సంతోశ్‌కుమార్ నియమితులయ్యారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దాస్ కా దమ్‌కి
నారాయణ: బలగం

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తాం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: దశల వారీగా సమస్యలు పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దాగాం గ్రామంలో ఉపాధి నిధులు రూ.10 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముధోల్ ఎక్స్‌రోడ్డు నుంచి దాగాం గ్రామం వరకు మిగిలిన బీటీ రోడ్డు పనులను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, సాయినాథ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యాదవ సంఘం మండల కార్యవర్గం

భైంసా: బాసర మండల శ్రీ కృష్ణయాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బత్తిరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జిడ్డు నవీన్ యాదవ్, ముదిలోల్ల లక్ష్మణ్‌యాదవ్, కోశాధికారిగా ముల్కి సురేశ్ యాదవ్, బండర్వార్ విశ్వంభర్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా జిడ్డు ప్రమోద్ యాదవ్, బాల సాయికుమార్ యాదవ్, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఆదివారం భైంసా మండలం దేగాంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని సన్మానించారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

- ముధోల్ సీఐ వినోద్
- పత్రాల్లేని వాహనాలకు జరిమానా



పట్టుబడిన వాహనాల వద్ద సీఐ వినోద్, సిబ్బంది

లోకేశ్వరం: నేరాల నియంత్రణకే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్(కమ్యూనిటీ అండ్ కాంటాక్ట్ ప్రోగాం)నిర్వహిస్తున్నామని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. ఆదివారం మండలంలోని సాత్‌గాంలో తెల్లవారుజామున కమ్యూనిటీ అండ్ కాంటాక్ట్ ప్రోగాం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సీఐ మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. దాతల సాయంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు సరిగా లేని 69బైక్‌లు, ఐదు ఆటోలు, రెండు ట్రాక్టర్లకు జరిమానా విధించారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, తానూర్, ముధోల్ బెటాలియన్ సిబ్బంది ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించండి



కొత్తమద్దిపడగలో మాట్లాడుతున్న రాజేందర్

కడెం: సదర్‌మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సదర్‌మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు హపావత్ రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ రైతులతో కలిసి కొత్తమద్దిపడగలో నిరసన వ్యక్తం చేశారు. సదర్‌మాట్ ఎగువ గ్రామాలైన వేమలకుర్తి, తదితర గ్రామాల రైతులు కాలువకు అడ్డకట్ట వేసి నీటిని మళ్లించడంతో మూడు రోజులుగా కడెం, ఖానాపూర్ మండలాల్లో పంటలు ఎండుతున్నాయని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో అడ్డుకట్టలు తొలగించాలని రైతులు మొర పెట్టుకున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు చివరి ఆయకట్టుకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోకుంటే రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు ముక్కెర గంగాధర్, రైతులు పరశురాం, గంగారాజం, రాయలింగు, రాములు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంచుకోవాలి

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఎదుగుతూ దేశభక్తి పెంచుకోవాలని ఆర్ఎస్ఎస్ కార్యకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్ కటకం మురళి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఉదాసి మఠం మైదానంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ అరవింద్‌శాఖ 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ తనను తాను సంస్కతిక సంస్థగా చూపిస్తుందన్నారు. సన్మార్గంలో నడిచి భరతమాత ప్రార్థన చేయడం ద్వారా వ్యక్తి నిర్మాణం జరుగుతుందన్నారు. విభాగ్ ప్రముఖ్ సరుకొండ దామోదర్, వోటరికారి విద్యాసాగర్, ప్రియదర్శినినగర్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న సర్పంచులు



నర్సాపూర్(జి): అవార్డు అందిస్తున్న మంత్రి, కలెక్టర్

నర్సాపూర్(జి): వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. మండలంలోని గొల్లమాడ చైల్డ్ ఫ్రెండ్లీ విభాగంలో, కుస్లీ క్లీన్ అండ్ గ్రీన్ విభాగాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. శనివారం జిల్లాకేంద్రంలోని దివ్యగార్డెన్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా గొల్లమాడ సర్పంచ్ చెన్న మహేశ్, కుస్లీ సర్పంచ్ స్వరూప భూమేశ్, కార్యదర్శులు నరేశ్‌కుమార్, కిరణ్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎంపీడీవో వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా లింబా(బి)

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. శనివారం రాత్రి నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ పెద్దికాపు మల్లేశ్, ఎంపీటీసీ సునంద, కార్యదర్శి సుమన్ అవార్డులు అందుకున్నారు. వీరిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ రహీం తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

కామోల్‌లో గీతా మహాయజ్ఞం



భైంసారూరల్: యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో గీతా మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రాంగణంలో 84 యజ్ఞగుండాలు ఏర్పాటు చేసి పూజలు జరిపించారు.

కృష్ణమందిర్ ఆలయంలో..

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో కృష్ణమందిర్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు రామారావ్ పటేల్ పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో చక్రధర్‌పటేల్, బాలాజీ పటేల్, సోమనాథ్, ఆనందర్‌రావ్, తానాజీ పటేల్, గోవింద్ పటేల్, తదితరులు ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు



భైంసాలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఐలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ గజ్జలమ్మదేవికి గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. గజ్జలమ్మ పల్లకిసేవలో భక్తులు పాల్గొన్నారు. తలనీలాలు సమర్పించి, తులాభారం మొక్కులు తీర్చుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, శివుని, అప్పారావుపేట్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

భైంసాటౌన్: పట్టణంలోని సుద్దవాగు శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గణపతి, నాగదేవత, పార్వతిదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



కుంటాల: కల్లూరు బాబా ఆలయంలో భజన



దస్తురాబాద్: పేర్కపల్లెలో ఆలయం వద్ద భక్తులు

కుంటాల: రెండో షిరిడీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, శ్రీ దత్త వెంకటసాయి హనుమాన్ సహిత నాగదేవత పూర్ణాభిషేకం, కలశ స్థాపన, సప్తాహ పారాయణం, ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి, అఖండ సాయి నామ సప్తాహ సంకీర్తన నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయ వార్షికోత్సవం

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మహిళలు పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, ఎంపీపీ సింగరి కిషన్, ఆత్మ వైస్ చైర్మన్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన నేపథ్యంలో స్థానిక బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మంత్రి ఐకేరెడ్డి వస్తున్నారని తమను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు రంజిత్, భరత్ నారాయణ, గంగాధర్, పుట్టి రవి, కంకల రవి తదితరులు ఉన్నారు.

సిద్ధమవుతున్న లక్ష తలంబ్రాలు



రామాలయంలో సిద్ధం చేస్తున్న తలంబ్రాలు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో రామాలయంలో సీతారాముల కల్యాణం కోసం లక్ష తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 31న ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కల్యాణం కోసం లక్ష తలంబ్రాలు సిద్ధం చేసే ప్రక్రియను ఆదివారం గ్రామస్తులు ప్రారంభించారు. గ్రామానికే చెందిన మహిళలు స్వయంగా చేతితో తలంబ్రాలు తీస్తున్నారు. కల్యాణ సమయం వరకు రాములోరికి లక్ష తలంబ్రాలు సిద్ధం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మొక్కల రీప్లేస్‌మెంట్

ఖానాపూర్: మండలంలోని సేవ్యానాయక్‌తండాలో నాటిన మొక్కల్లో 80 వరకు చనిపోయాయి. ఇటీవల సామాజిక తనిఖీ గ్రామసభలో ఇచ్చిన హామీ మేరకు చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటిస్తున్నాడు పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ.